



సుంకేశుల బ్యారేజీ దిగువన చేపల వేటలో జాలర్లు



- మత్స్యకారులను విస్మరించిన గత వైసీపీ ప్రభుత్వం
- ఫిష్ ఆంధ్ర పేరిట అప్పట్లో జగన్ హడావుడి
- జీవో 217 రద్దుతో మత్స్యకారుల సంఘాలకు ఊరట
- జిల్లాలో 1.05 కోట్ల చేప పిల్లల సంరక్షణ లక్ష్యం
- జాలర్ల సంఘాలకు 60 శాతం సబ్సిడీతో చేప పిల్లల సరఫరా
- కూటమి ప్రభుత్వంతో ఊరట

# గంగపుత్రుల ఆశలు



కర్నూలు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో చేపలు పెంపకానికి అనుకూలంగా గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీ-నీవా ప్రాజెక్టుకు చెందిన పత్తికొండ (పందికోన), కృష్ణగిరి, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని పులికనుమ జలాశయాలు సహా 52 చిన్ననీటి పారుదల శాఖ చెరువులు ఉన్నాయి. నాలుగు జలాశయాల్లో బహిరంగ వేలం ద్వారా చేపల పెంపకం కోసం లీజుకు ఇస్తారు. చెరువులలో సంబంధిత మత్స్యకారుల సహకార సంఘాలు చేపల పెంపకం చేపడుతున్నాయి. తుంగభద్ర నది, సుంకేశుల బ్యారేజీలో చేపల పట్టి ఉపాధి పొందేందుకు 876 మంది జాలర్లకు లైసెన్స్ ఇచ్చారు. జిల్లాలో 32 మత్స్యకారుల సహకార సంఘాలు, ఐదు మహిళా మత్స్యకారుల సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లో 1,642 మంది సభ్యులు ఉన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ప్రభుత్వం పలు రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా గత వైసీపీ ప్రభుత్వం ఫిష్ఆంధ్ర పేరిట హంగామా చేసిందే తప్పా వారి సంక్షేమం, ఆర్థిక చేయూత కోసం చేసిందేమీ లేదనే ఆరోపణలు ఉన్నాయి. రిజర్వాయర్లలో కూడా వైసీపీ నాయకుల ఆధిపత్యంలోనే చేపల పెంపకం సాగించారు. మత్స్యకారులకు నామమాత్రంగా చేతిలో పెట్టి మధ్య దళారీలు రూ.కోట్లు కొట్టేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక వారి సంక్షేమంపై దృష్టి సారించింది.

> మత్స్యకారుల సంక్షేమానికి గత టీడీపీ ప్రభుత్వం వలలు, ఐస్ బాక్సులతో కూడిన మోపెడ్‌లు, ఆటోలు రాయితీపై ఇచ్చింది. సహకార సంఘాల బలోపేతానికి కృషి చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 'ఫిష్ ఆంధ్ర' పేరిట హడావుడి చేసిందే తప్ప జాలర్ల అభ్యున్నతికి చేసిందేమీ లేదు. అంతేకాదు.. సహకార సంఘాలను నిర్వీర్యం చేస్తూ వంద హెక్టార్లకు పైగా ఉన్న చెరువులు, జలాశయాలు వైసీపీ నాయకులకే కట్టబెట్టేలా జీవో నంబరు 217 తీసుకొచ్చారు. మళ్లీ సీఎం చంద్రబాబు సారథ్యంలో వచ్చిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జీవో నంబరు 217 రద్దు చేయడంతో మత్స్యకారులలో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 1.05 లక్షల చేప పిల్లలను వదలాలని ప్రభుత్వం లక్ష్యంగా ప్రకటించింది.



### 1.05 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యం

జిల్లాలోని 52 చెరువులు, నాలుగు రిజర్వాయర్లు, తుంగభద్ర నది, సుంకేశుల జలాశయంలో చేపల పెంపకం జరుగుతోంది. గతేడాది వర్షాభావం వల్ల చెరువుల్లో నీరు చేరకపోవడంతో లక్ష్యం చేరకోలేదు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయి. చెరువులు, రిజర్వాయర్లు, తుంగభద్ర నదిలో 1.05 కోట్ల చేప పిల్లలను వదలాలని ప్రణాళిక సిద్ధం చేశాం. సహకార సంఘాల పర్యవేక్షణలోని చెరువుల్లో వదిలే చేప పిల్లలకు సబ్సిడీ వస్తుంది. పీఎంఎంఎస్‌వై కింద ఆర్థిక సహాయం అందిస్తుంది.

- శ్యామల, డిప్యూటీ డైరెక్టర్, మత్స్య శాఖ, కర్నూలు

### 1.05 కోట్ల చేపల పెంపకం

తుంగభద్ర నది సహా వివిధ జలాశయాలు, చెరువుల్లో 2024-25 సంవత్సరంలో 1.05 కోట్ల చేప పిల్లలు వదిలేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 25 చెరువుల్లో 25 లక్షలు, పత్తికొండ, కృష్ణగిరి, గాజులదిన్నె, పులికనుమ జలాశయాల్లో 70 లక్షలు, తుంగభద్ర నది, సుంకేశుల బ్యారేజీలో 10 లక్షల చేప పిల్లలను వదిలి పెంపకం చేసేలా జిల్లా మత్స్యశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో కర్నూలు, సుంకేశుల, గాజులదిన్నె ప్రాజెక్టుల వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో చేపపిల్ల రూ.1.68 పైసలు పడుతుంది. మత్స్యకారుల సహకార సంఘాల పర్యవేక్షణల్లోని చెరువుల్లో వదిలే చేప పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తే లబ్ధిదారులు 60 శాతం భరించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒక చెరువులో లక్ష చేప పిల్లలు వదిలితే రూ.1.68 లక్షలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం రూ.79,200 రాయితీ, రూ.1,18,800 సహకార సంఘాలు భరించాల్సి ఉంటుంది. బహిరంగ వేలం నిర్వహించే పత్తికొండ, కృష్ణగిరి, గాజులదిన్నె, పులికనుమ జలాశయాల్లో చేప పిల్లలను లీజుదారుడు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తుంగభద్ర నది, సుంకేశుల బ్యారేజీల్లో వదిలే చేప పిల్లల ఖర్చు వంద శాతం ప్రభుత్వమే భరిస్తుంది. ఇక్కడ చేపలు పట్టే 876 మంది లైసెన్సుదారుల నుంచి ఒక్కొక్కరి నుంచి ఏడాదికి రూ.600 ప్రకారం రూ.5.25 లక్షలు లైసెన్స్ రెన్యువల్ ఫీజు వసులు చేస్తారు.

### జీవో నంబరు 217 రద్దు

గత వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల జీవనోపాధిని విఘాతం కలిగించేలా జీవో నంబరు 217 తీసుకొచ్చారు. ఈ జీవో ప్రకారం 100 హెక్టార్లు పైబడి చెరువులు, జలాశయాల్లో చేపలు పెంపకం కోసం ఓపన్ యాక్షన్ ద్వారా లీజుకు ఇస్తారు. అంటే అధికారం ఎవరిది ఉంటే వారిదే ఆ చెరువుల్లో చేపలు పెంపకం పెత్తనం ఉంటోంది. మత్స్యకార సహకార సంఘాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రోడ్డెక్కినా గత జగన్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా అనిపించలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే మత్స్య శాఖ మంత్రి గత జగన్ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు-217 రద్దు చేస్తూ తొలి సంతకం చేశారు. గాజులదిన్నె జలాశయంలో చేపల పెంపకం కోసం ఇప్పటి వరకు ఓపన్ యాక్షన్ ద్వారా లీజుకు ఇచ్చే వారు. రాజకీయ బలం ఉన్నోడిదే చేపల వేటగా సాగింది. జీవో రద్దుతో ఆ జలాశయంపై ఆధారపడిన మత్స్యకారుల సహకారం సంఘానికే హక్కు వస్తుంది. అదే క్రమంలో పత్తికొండ, కృష్ణగిరి, పులికనుమ జలాశయాల పరిసర గ్రామాల మత్స్యకారులు సహకార సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకొని స్వయంగా చేపల వేట సాగిస్తే ఆ జలాశయాలపై కూడా హక్కు వస్తుంది.

### పీఎంఎంఎస్‌వై ద్వారా ఆర్థిక చేయుత

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం ద్వారా మత్స్యకారులకు ఉపాధి, జీవన ప్రమాణాల మెరుగుకు అవసరమైన ఆర్థిక చేయుత అందిస్తారు. జిల్లాలో చేపల పెంపకం, వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఎస్సీ మత్స్యకారులు 23 మందికి రూ.1.72 కోట్లు, మహిళలు 9 మందికి రూ.38.40 లక్షలు, జనరల్ కేటరిగి కింద 75 మందికి రూ.2.35 కోట్లు ఆర్థిక చేయూత అందించారు. అలాగే కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ) కింద మహిళలు నిర్వహించే చేపల ఆహార కేంద్రాలు (ఫిష్ అండ్ రెస్టారెంట్స్)కు 60 శాతం సబ్సిడీతో ఆర్థిక సాయం అందిస్తారు. ప్రస్తుతం కర్నూలు సి.క్యాంప్, ఎమ్మిగనూరు, సుంకేశుల వద్ద ఫిష్ రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు.

### విద్యుత్ రాయితీ ఏదీ..?

ఆదోని మండలం సంతేకూడ్లూరు, కోసిగి మండలం సాతనూరు, మంత్రాలయం మండలం తుమ్మిగనూరు గ్రామాల పరిధిలో 425 ఎకరాల్లో 36 మంది ఫిష్ ఫార్మర్స్ ఫిష్‌కల్చర్ చేస్తున్నారు. గతంలో 700 ఎకరాల్లో ఉంటే నీటి సమస్య వల్ల తగ్గిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఫిష్ కల్చర్ చేసే రైతులకు విద్యుత్ రాయితీ ఉండేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాయితీ ఎత్తేశారని రైతులు అంటున్నారు. విద్యుత్ సబ్సిడీతో పాటు చేపలకు వేసే ఆహారం (ఫీడ్), ఐస్ బాక్సులు రాయితీపై అందిస్తే ఫిష్ కల్చర్ మరింత అభివృద్ధి చెందుతుందని చేపలు పెంపకం సాగించే రైతులు కోరుతున్నారు.



పత్తికొండ జలాశయంలో చేపల వేట

## జిల్లా ప్రధాన న్యాయాధికారిగా కబర్ది



కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్దికి పూలమొక్కను అందజేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

**కర్నూలు (లీగల్), ఆగస్టు 8:** కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారిగా జి.కబర్ది గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత వారంలో పదవి విరమణ చేసిన జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావు స్థానంలో ఇన్‌చార్జి న్యాయాధికారిగా కర్నూలు ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి బాధ్యతలు నిర్వహించారు. ఆమె నుంచి నూతన జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు న్యాయాధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఎస్పీ జి. బిందు మాధవ్ నూతన ప్రధాన న్యాయాధికారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అందరి సహకారంతో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందిస్తానని అన్నారు. అంతకుముందు స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలారి రవిగువేరా ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం నూతన ప్రధాన న్యాయాధికారిని అభినందనలు తెలిపారు.


## ఎంపీడీఓల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

**కర్నూలు(న్యూసిటీ ), ఆగస్టు 8:** రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీఓలను తిరిగి వారు గతంలో పని చేసిన ప్రాంతాలకే పంపాలని పీఆర్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేసినట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈ ఏడాది జనవరి 30న ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు 33 మంది, కడపకు ఏడుగురు (మొత్తం 40 మంది) ఎంపీడీఓలు ఎన్నికల విధులు నిర్వహించేందుకు బదిలీ అయ్యారన్నారు. వీరి స్థానంలో అనంతపురం జిల్లా నుంచి 23 మంది, కడప జిల్లా నుంచి 16 మంది (మొత్తం 39 మంది) ఎంపీడీఓలు కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎన్నికల విధుల నిర్వహణకు వచ్చి ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీరందరినీ గతంలో పని చేసిన జిల్లాలకు పంపేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రెండు, మూడు రోజుల్లో ఇక్కడ పని చేసిన ఇతర జిల్లాలకు చెందిన ఎంపీడీఓలు గతంలో వారు పని చేసిన ప్రాంతాలకు వెళ్తారని, వారి స్థానంలో ఇతర జిల్లాలకు వెళ్లిన ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎంపీడీఓలు బాధ్యతలు చేపడతారని తెలిపారు.



## ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

- 1,377 కమిటీలకు ఎన్నికలు పూర్తి
- కోరం లేక 79 చోట్ల వాయిదా
- అన్నింటా టీడీపీ సానుభూతిపరులదే హవా



తుగ్గలిలో నూతన కమిటీ సభ్యులతో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి తదితరులు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 8:** కర్నూలు జిల్లాలో అన్ని ప్రభుత్వ యజమాన్య పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. చిన్న చిన్న సంఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆధ్వర్యంలో షెడ్యూల్ ప్రకారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో మొత్తం 1,456 స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఉన్నాయి. ఇందులో 1,377 పాఠశాలల యజమాన్య కమిటీలకు ఎన్నికలు పూర్తి అయ్యాయి. కోరమ్, ఇతర కారణాలతో 79 పాఠశాలల కమిటీలకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. వీటికి ఎప్పుడు ఎన్నికలు చేపట్టేది జిల్లా విద్యాశాఖ అధికారులు త్వరలో ప్రకటించనున్నారు. జిల్లాలో ఎస్ఎంసీ కమిటీలు ప్రశాంతంగా జరగడానికి పోలీసు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించిన పోలీసు అధికారులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో టీడీపీ సానుభూతిపరులే ఎస్ఎంసీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. విద్యా కమిటీలను కైవసం చేసుకోవడంలో ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకులు కీలకంగా వ్యవహరించారు.

## కర్నూలు-బళ్లారి హైవే ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 8:** కర్నూలు నుంచి బళ్లారికి హైవే ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలోని 167వ జాతీయ రహదారి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని కోరారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మంత్రాలయం నుంచి బళ్లారికి వెళ్లే 167వ జాతీయ రహదారి పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఆదోని-ఆలూరు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే కర్ణాటక-ఆంధ్ర ప్రాంతాల్లో వాణిజ్య, పర్యాటక అభివృద్ధి జరుగుతుందన్నారు.

## కదులుతున్న అవినీతి డొంక

● విచారణకు ఆదేశించిన ఆదోని సబ్ కలెక్టర్

● తల పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**హొళగుంద ఆగస్టు 8:** హొళగుంద తహసీల్దార్ కార్యాలయం అవినీతి అడ్డాగా మారిందని ఈ నెల ఏడో తేదీ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అవినీతి రాబందు అనే కథనంపై కలెక్టర్ రంజిత్ బాషా స్పందించారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మను విచారించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులకు గురువారం ఆదేశాలు అందాయి. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలు నిజమని తెలిసినా జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆయనను కాపాడేందుకుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అవినీతికి పాల్పడిన ఉన్నతాధికారిపై చర్యలు తీసుకుంటారా? లేదా అనే సందేహం మండల ప్రజల్లో నెలకొంది.

## మరో ఆరు మండలాలకు తహసీల్దార్లు

**నంద్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలోని ఆయా మండలాలకు తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ రాజకుమారి గణియా ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగు మండలాలకు రెగ్యులర్ తహసీల్దార్లను నియమించగా, రెండు మండలాలకు డిప్యూటీ తహసీల్దార్లకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరు కాకుండా మరికొంత మంది పోస్టింగుల కోసం వేచి చూస్తున్నారు. వీరికి ఒకటి రెండ్రోజుల్లో ఆయా మండలాల్లో స్థానాలు కేటాయించే అవకాశం ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీసులు, ఆయా మండలాలకు 22 మంది తహశీల్దార్లకు స్థానాలు కేటాయించిన సంగతి తెలిసిందే. షేక్ మోహిద్దీన్‌ను గోస్పాడుకు, టి.అంజనాదేవిని ఆర్డీవో కార్యాలయానికి (ఆత్మకూరు), షేక్ హసీనా బీ ఆర్డీవో కార్యాలయానికి (నంద్యాల), జి. సుభద్రమ్మ, పాములుపాడుకు, పి.సత్యదీప్ డోన్‌కు(ఎఫ్ఏసీ), పి. అనిల్ కుమార్ సంజామల(ఎఫ్ఏసీ)కు నియమితులయ్యారు.

## మహానందిలో జిల్లా ప్రధాన న్యాయాధికారి



జిల్లా జడ్జికి స్వామి వారి ప్రసాదాలు అందజేస్తున్న వేదపండితులు

**మహానంది, ఆగస్టు 8:** మహానంది ఆలయంలో గురువారం కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఏఈఓ ఎర్రమల్ల మధు ఆద్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభి షేకార్చన పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేద పండితులు సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున ఉన్నారు.

## 20న నులి పురుగుల మాత్రల పంపిణీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 8:** ఈ నెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ ఐ.హేమలత తెలిపారు. గురువారం నగరంలోని వీకర్ సెక్షన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగు తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతుల అపరిశుభ్రతతోనే అనేక పురుగులు పిల్లల కడుపులోకి చేరుతాయనీ, ఇవి నులిపురుగుల, ఇతర పురుగులు పొట్టలో వృద్ధి చెందుతా యన్నారు. కాబట్టి ప్రతి ఒక్క విద్యార్థి భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. నులిపురుగుల నివారణ మాత్రలు 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలమందు మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాలిక్‌ఖాన్, సచివాలయ ఆరోగ్యకార్యకర్త సత్య సులోచన, పాపమ్మ, ఆషా కార్యకర్తలు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

## 1,3 సెమిస్టర్ ఫలితాలు విడుదల

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 8:** రాయలసీమ యూనివ ర్సిటీ పరిధిలో జన వరిలో నిర్వహించిన 1,3 సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను వర్సిటీ అధికారులు గురువారం విడుదల చేశారు. 1వ సెమిస్టర్‌లో 1609కి 261 మంది, 3వ సెమిస్టర్‌లో 2,555 మంది హాజరయ్యారు. ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## నేడు మాజీ సీఎం జగన్ సీతారామపురానికి రాక

**మహానంది, ఆగస్టు 8:** మహానంది మండలం సీతారామపురం గ్రామానికి శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నట్లు వైసీపీ నాయకులు తెలిపారు. ఈనెల 3వ తేదీన సీతారామపురంలో వైసీపీ కార్యకర్త సుబ్బరాయు దారుణహత్యకు గురయ్యాడు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ సీఎం జగన్ వస్తున్నారు. ఉదయం 9 గంటలకు ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు ఆయన చేరుకుని రోడ్డు మార్గం ద్వారా నంద్యాల మీదుగా మహానంది మండలం సీతారామపురం గ్రామానికి 11 గంటలకు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చుతారు. అనంతరం మీడియాతో మాట్లాడుతారని వైసీపీ నాయకులు తెలిపారు.

## పశుగణన పూర్తి చేయండి

● ఇన్‌చార్జి జేసీ డీఆర్వో మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న డీఆర్వో మధుసూదన్‌రావు

**కర్నూలు(అగ్రికల్చర్), ఆగస్టు 8:** దేశంలో పశుగణన కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని కర్నూలు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావు ఆదేశించారు. 21వ పశుగణన కార్యక్రమం కర్నూలు జిల్లాలో ప్రారంభిస్తున్న సందర్భంగా ఎటువంటి ఆటంకాలు లేకుండా సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని గురువారం కర్నూలు నగరంలోని బహుళార్థ సాధక ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మధుసూదన్‌రావు మాట్లాడుతూ పశుగణన సక్రమంగా చేపట్టేందుకు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ గుడివాడ శ్రీనివాస్ మాట్లాడుతూ భారతదేశం అంతటా ఈ ఏడాది సెప్టెంబరు 1వ తేదీ నుంచి డిసెంబరు వరకు ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్స్‌కు వెళ్లి పశు సంపద వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టరు డా. ప్రసన్నబాబు, ఇతర డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, లైవ్ స్టాక్ సెన్సెస్ నోడల్ ఆఫీసర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఉన్నారు.

# సెప్టెంబరు 30లోగా పురోగతి సాధించాలి

● వెనుకబడిన మండలాల అభివృద్ధి

● నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8:** నిర్దేశించిన ప్రాజెక్టుల్లో సెప్టెంబరు 30లోపు పురోగతి సాధించాలని నీతి అయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం కలెక్టర్‌కు సూచించారు. గురువారం ఢిల్లీ నీతి అయోగ్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని రాష్ట్రాల జిల్లాల కలెక్టర్లతో ఆస్పిరేషనల్ బ్లాక్‌కు సంబంధించిన వివిధ అంశాలపై నీతి అయోగ్ సీఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో మాట్లాడుతూ భారతదేశంలోని వెనుకబడిన మండలాలను అభివృద్ధి చేసేందుకు 500 మండలాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆస్పిరేషనల్ బ్లాక్స్ అనే కార్యక్రమం నీతి అయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ మండలాల్లో అభివృద్ధి చేయడం కోసం 39 ఇండికేటర్స్‌ను ప్రవేశపెట్టి వంద శాతం పురోగతి సాధించాలనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందుకు 39 ఇండికేటర్స్‌లో మొదటిగా 6 ఇండికేటర్స్‌ను ఎంపిక చేసి సంపూర్ణత అభియాన్ అనే కార్యక్రమం ద్వారా (యాంటినేటల్ కేర్) 3 నెలల్లోపు ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. డయాబెటీస్, హైపర్టెన్షన్‌ను పూర్తి స్థాయిలో స్ర్కీనింగ్ చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు గర్భిణీ స్త్రీలకు సంబంధించి వంద శాతం టేక్ హోం రేషన్ అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో సాయిల్ హెల్త్ కార్డ్స్ అందజేయాలన్నారు. డీఆర్‌డీఏకు సంబంధించి ఉన్న గ్రూపులకు సంబంధించి అర్హులైన వారిక రివాల్వింగ్ ఫండ్స్ అందజేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, సీపీవో హిమప్రభాకర్ రాజు, డీఎంహెచ్‌వో భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ పీడీ సలీంభాషా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

# ఆర్టీసీ రిటైర్డ్ డ్రైవర్ దీక్ష

● రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయని డిపో మేనేజర్

● వేధింపులకు గురి చేస్తున్నాడని ఆవేదన



దీక్ష చేస్తున్న రిటైర్డ్ డ్రైవర్ హయత్ సాహెబ్

**ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 8:** ఆర్టీసీలో ఓ చిరుద్యోగి. రిటైర్ అయ్యాక రావాల్సిన బెని ఫిట్స్ ఇవ్వకుండా డిపో మేనేజర్ వేధిస్తున్నాడు. ఆదోని ఆర్టీసీ డిపో ముందు రిటైర్డ్ డ్రైవర్ ఎం.దాదాహయత్ సెహెబ్ (407037) డిపో మేనేజర్ ఎండీ రఫీ వేధింపులకు నిరసనగా గురువారం దీక్ష చేపట్టాడు. ఆయనతో పాటు మరో ఆరుగురు జూన్ 30న రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి వారికి ఒక పైసా కూడా రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయలేదు. ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అయిన రోజే కొంత డబ్బు చెక్కు. రూ పంలో ఇస్తారు. అయితే తమ డిపోలో మేనేజర్ కక్ష సాధింపుగా ఒక్కపైసా కూడా ఇవ్వకుండానే తమను రిటైర్ చేశారని ఆయన వీరు ఆరోపించారు. తమకు రావలసిన ప్రావిడెంట్ ఫండ్స్ (పీఎస్), గ్రాడ్యుటీ బెనిఫిట్స్‌తో పాటు ఇతర బకాయిలను మంజూరు చేయ కుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆయన ఆరోపిం చారు. మూడు నెలలగా బకాయిలు చెల్లించకుండా, తమకు వచ్చే కొద్దిపాటి పెన్షన్ కూడా మంజూరు చేయకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని కన్నీరు కార్చారు. డాక్యుమెంట్లను కార్యాలయంలో సమర్పించినప్పటికీ డిపో మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుం డా వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్ఎం కార్యాలయం చీఫ్ ట్రాఫిక్ మేనే జర్‌కు, ఆర్ఎంకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. రాష్ట్రంలో అన్ని డిపోలలో రిటైర్ అయిన వారికి వెంటనే రిటైర్మెంట్ బకాయిలు ఇస్తున్నారన్నారు. ఆదోని డిపోలో మేనేజర్ రఫీ కండక్టర్లను డ్రైవర్లను డ్యూటీలు 12 నుంచి 14 గంటలకు పైగా పని చేయించుకోవడమే కాకుండా అనారోగ్యంగా ఉన్నా సెలవు మంజూరు చేయకుండా వేధిస్తున్నారన్నారు. రిటైర్మెంట్ బకాయిలు చెల్లించకపోతే 12వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీక్ష చేపట్టారు.

# దూరవిద్యలో పది, ఇంటర్ ప్రవేశాలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8:** 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య విధానం) పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవా లని ఇన్‌చార్జి జేసీ, డీఆర్వో మధుసూదన్‌రావు సూచించారు. గురువారం డీఆర్వో కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక విద్య ఎంతో మందికి ఉపయోగపడు తుందన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త చంద్రభూషణ్‌రావు మాట్లాడుతూ ఎలాంటి విద్యార్హత లేకుండా 14 సంవత్సరాలు నిండిన వారు పదవ తరగతికి, పదవ తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ కోర్సులో చేరడానికి అర్హులు అన్నారు. ఈ నెల 28వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చన్నారు. రూ.200 అదనపు రుసుంతో సెప్టెంబరు 4 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. పదవ తరగతిలో ప్రవేశం కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1300, ఇంటర్మీడియట్ వారికి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1400 అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మమ్మ, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, డీపీవో నాగరాజు నాయుడు జిల్లా లేబర్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ డెమో చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఏ ముఖం పెట్టుకొని వస్తున్నావ్..?

● సలాం కుటుంబంపై ఎందుకు స్పందించలేదు?

● జగన్‌పై మండిపడ్డ టీడీపీ నేత సోమిశెట్టి



**కర్నూలు(అర్బన్), ఆగస్టు 8:** 'ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత తగాదాలతో హత్యకు గురైన వ్యక్తి కుటుంబానికి తెలుగుదేశం పార్టీకి ఆపాదిస్తున్నావ్.. సలాం కుటుంబం ఆత్మహత్య చేసుకున్నప్పుడు నంద్యాల గుర్తుకు రాలేదా? ఏమొహం పెట్టుకుని వస్తున్నావ్.' అంటూ మాజీ సీఎం జగన్‌పై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీపాలనలో వేలాదిమంది వేధింపులకు గురై బలయ్యారన్నారు. నంద్యాల పట్టణంలో అబ్దుల్ సలాం కుటుంబం వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటే ఎందుకు ఆనాడు స్పందించలేదని జగన్‌ను ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 36 హత్యలు జరిగాయంటూ గగ్గోలు పెడతుఉన్న జగన్.. వారి జాబితా ఎందుకు ఇవ్వలేకపోతున్నాడని ప్రశ్నించారు. గ్లోబల్ ప్రచారాలతో ఇంకెంతకాలం ప్రజలను మభ్యపెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవిడ్ సమయంలో మాస్క్ అడిగిన దళిత డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా వేధించి, చనిపోవడానికి కారణమైంది వైసీపీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. గులకరాయి, కోడికత్తి డ్రామాలను తిరస్కరించిన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని తిప్పికొట్టారన్నారు. ఘోర పరాభవం ఎదురైనా వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నాయకుల్లో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నంద్యాల నాగేంద్ర, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణ, నగర కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# చీకటి జీవో రద్దుకు కృషి చేయండి..

● రాయలసీమలో కరువు, వలసలను నిర్మూలించండి

● మంత్రులకు విజ్ఞప్తి చేసిన రాయలసీమ సాగునీటి సాధన సమితి



నీటి అవగాహనే రాయలసీమకు రక్ష పుస్తకాలను మంత్రులకు అందజేస్తున్న సాగునీటి సాధన సమితి నాయకులు

**నంద్యాల టౌన్, ఆగస్టు 8 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం అక్టోబరు 6, 2023న తీసుకొని వచ్చిన చీకటి జీవో రద్దు కోసం మంత్రులు కృషి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గత రెండు రోజుల్లో వివిధ సమయాల్లో అమరావతిలో జమ్మలమడుగు శాసన సభ్యుడు ఆదినారాయణరెడ్డితో కలిసి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిలను వెలగపూడి సెక్రటేరియట్‌లో దశరథరామిరెడ్డి కలిశారు. కృష్ణా నది వరదతో శ్రీశైలం రిజర్వాయర్ నిండినా రాయలసీమకు ు మళ్లించడంలో ఉన్న అవాంతరాలను ప్రాజెక్టుల వారిగా మంత్రులకు వివరించారు. హంద్రీ-నీవా, గాలేరు -నగరి, బ్రహ్మసాగర్ ద్వారా తెలుగు గంగకు నీటి తరలింపులలో ఉన్న సమస్యలు, గత ఏడు సంవత్సరాలుగా మరమ్మత్తులు నోచుకోక నిరుపయోగంగా ఉన్న అలగనూరు రిజర్వాయర్, కుంగిన రివిట్మెంట్‌తో గోరుకల్లు రిజర్వాయర్ మరమ్మతులు, గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణంపై మంత్రులకు వివరించారు. ఈ పనుల కోసం తక్షణమే నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీరు లభించడానికి ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు, రిజర్వాయర్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టితో ఒక ప్రణాళికను రూపొందించి కరువు, వలసలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సాగునీటి అంశాలపై తాను రాసిన "నీటి అవగాహనే రాయలసీమకు రక్ష" పుస్తకాన్ని మంత్రి నిమ్మలకు బొజ్జా ఇచ్చారు. ఈ అంశాలపై మంత్రి నిమ్మల సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యేక కార్యాచరణతో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జల వనరుల శాఖ (సాగు నీటి) ఈఎన్‌సీ వెంకటే శ్వరరావు, జలవనరుల శాఖ (అంతర్ రాష్ట్ర విభాగం)ఈఎన్‌సీ శ్రీనివాస్‌లను కలిసి రాయలసీమ సాగునీటి సమస్యలపై చర్చించారు.

## హత్యకేసులో నిందితులకు రిమాండ్

**నంద్యాల క్రైం, ఆగస్టు 8:** మహానంది మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడు హత్య కేసులో నిందితులను గురువారం నంద్యాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించినట్లు నంద్యాల తాలుకా సీఐ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. నిందితుల్లో బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొర్రపోలు భరత్‌రెడ్డి అలియాస్ కంటరెడ్డి భరత్‌రెడ్డి, షేక్‌ముజైతుల్లాహ్ అలియాస్ ముజావుద్దీన్, కందుల రామభూపాల్‌రెడ్డి అలియాస్ బుక్కాపురం భూపాల్‌రెడ్డి, దూదేకుల ఖాసిం అలియాస్ పెద్ద ఖాసింలతోపాటు మరో నలుగురు ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

## సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాల్లో సర్పంచు లు, గ్రామపంచాయితీ కార్యదర్శులకు మూ డు రోజు లపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయి తీరాజ్ అండ్ రూరల్ డెవ లప్‌మెంట్ డైరెక్టర్, ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఉంటుం దన్నారు. 12వ తేదీ నుంచి 14 వరకు జరిగే శిక్షణలో శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌తో పాటు గ్రామపంచాయి తీల అభివృ ద్ధిపై చర్చిస్తారన్నారు. ఎంపీ డీఓ, ఈఓపీ ఆర్‌డీలు ఒక్కో బ్యాచ్‌కు 40-50 మంది సభ్యులు ఉండే విధంగా ప్రణాళికలు చేసుకో వాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి సర్పంచు లు, పంచాయితీ కార్యదర్శులు తప్ప కుండా హాజరుకావాలన్నారు.

## సిల్వర్ జూబ్లీ హాస్టల్ విద్యార్థులకు ఒక్క రూపాయికే కిలో బియ్యం

### జీఓ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8:** సిల్వర్ జూబ్లీ కళాశాలలోని హాస్టల్ విద్యార్థులకు ఒక్క రూపాయికే కిలో బియ్యం సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ.నెం.7ను విడుదల చేసింది. ఇప్పటి వరకు పౌర సరఫరాల శాఖ ద్వారా కిలో బియ్యం రూ.45.50 పైసలకు కొనుగోలు చేయడం జరిగింది. ఈ జీఓ విడుదల వల్ల ఒక్క రూపాయికే కిలో బియ్యం కొనడం వల్ల మిగులుతున్న మొత్తంలో హాస్టల్‌లో ఉన్న సుమారు 706 మంది విద్యార్థులకు మరింత పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేయనున్నారు.

## 20 మంది ఎస్ఐలు బదిలీ

**కర్నూలు, ఆగస్టు 8:** కర్నూలు రేంజ్ పరిధిలో 20 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

| పేరు | ప్రస్తుత స్థానం | బదిలీ స్థానం |
|---|---|---|
| టి.నరేంద్ర కుమార్ రెడ్డి | వీఆర్, కర్నూలు | పాణ్యం |
| రామ్మోహన్ రెడ్డి | రేవనూరు | వెలుగోడు |
| ఎం.జగన్మోహన్ | మిద్తూరు | బండిఆత్మకూరు |
| కే.మమత | మహిళాపీఎస్, కర్నూలు | డోన్ |
| పి.అశోక్ | పాణ్యం | బేతంచెర్ల |
| ఎం.నరేంద్ర కుమార్ | ఆన్ రిపాట్రియేషన్,సీఐడీ | డోన్ |
| ఎం.రాజారెడ్డి | వీఆర్ఎస్‌పీ | అవుకు |
| జి.శరత్ కుమార్ రెడ్డి | డోన్ టౌన్ | వీఆర్, నంద్యాల |
| కె.సురేష్‌బాబు | బుక్కపట్నం (శ్రీసత్యసాయి) | పాములపాడు |
| ఎం.చంద్రశేఖర్ | సింగనమల, అనంతపురం జిల్లా | నందికొట్కూరు |
| జి.సురేష్‌బాబు | కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా | నందికొట్కూరు |
| హరిప్రసాద్ | కొత్తపల్లి పీఎస్ | ఆళ్లగడ్డ రూరల్ |
| బి.చిన్న పీరయ్య | పెద్దతుంబళం | సిరివెళ్ల |
| పి.రామిరెడ్డి | బనగానపల్లె | రుద్రవరం |
| యు.వరప్రసాద్ | కోయిలకుంట్ల | గడివేముల |
| హెచ్.ఓబులేసు | వీఆర్, కర్నూలు | వీఆర్, నంద్యాల |
| బీవీ సుబ్బారెడ్డి | కుప్పం, చిత్తూరు జిల్లా | శ్రీశైలం టూటౌన్ |
| గోపినాథ్ | మంత్రాలయం | వీఆర్, నంద్యాల |
| పి.వెంకటేశ్ | మదనపల్లి, అన్నమయ్య జిల్లా | వీఆర్, నంద్యాల |
| యు.వెంకటప్రసాద్ | గాలివీడు, అన్నమయ్య జిల్లా | వీఆర్ నంద్యాల |

## రోడ్డు ప్రమాదంలో ఏఎస్ఐకు తీవ్ర గాయాలు

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8:** ఎమ్మిగనూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ బాలనాయక్‌కు గురువారం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. విద్యాకమిటీ ఎన్నికలు జరుగుతుండడంతో బందోబస్తు నిమిత్తం ఏఎస్ఐ బాలనాయక్, కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి ఎమ్మిగనూరు నుండి కడివెళ్ల గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్లారు. శ్రీరామ్‌నగర్ దాటి వెళ్తుండగా మాస్‌మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ఆటో ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏఎస్ఐ బాలనాయక్ కుడికాలు విరిగిపోయింది. అదేవిధంగా కానిస్టేబుల్ సర్వేశ్వరరెడ్డి కాలుకు స్వల్పగాయమైంది. స్థానికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తర లించగా బాలనాయక్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

**దేవనకొండ, ఆగస్టు 8 :** దేవనకొండ టర్నింగ్ వద్ద మీటరు సర్వీసు వైరు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కొత్తపేట గ్రామానికి చెందిన ముల్ల మస్తాన్‌వలి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పొలాల్లో స్ప్రే చేసే యంత్రాల రిపేరీ మెకానిక్‌గా మస్తాన్ పని చేస్తూ దానికి సంబంధించిన దుకాణం నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం దుకాణం ఖాళీ చేశాడు. గురువారం మధ్యాహ్నం అందులో వున్న మీటరు సర్వీసు వైరు తొలగించే క్రమంలో వైరుకు కరెంట్ సప్లయ్ కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయపడ్డ మస్తాన్‌ను స్థానికులు కర్నూలుకు తరలించారు.

## ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌కు జైలు

**కర్నూలు(లీగల్), ఆగస్టు 8:** స్థానిక నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక మహిళపై అత్యాచారయత్నం చేసిన ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ కానిస్టేబుల్ శోభన్‌బాబుకు ఒక ఏడాది జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ కర్నూలు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోత్స్నా దేవి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక రామలింగేశ్వర్ నగర్‌కు చెందిన బాధితురాలు 2019 డిసెంబరు 25న తన ఇంట్లోని చెత్త పడేయడానికి బయటకు వచ్చింది. అదే సమయంలో ప్రస్తుతం నంద్యాలలో పని చేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వుడ్ హెడ్ కానిస్టేబుల్ శోభన్ బాబు ఆమెపై అత్యాచారం యత్నం చేశాడు. బాధితురాలు కేకలు వేయగా.. ఆమె భర్తతో పాటు ఇరుగు పొరుగు వారు అక్కడకు రావడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితునిపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.10వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఖాదర్‌బాషా వాదించారు.

## కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని మోసం

● టికెట్ రాక.. డబ్బులు ఇవ్వకపోవడంతో కిడ్నాప్

● పోలీసుల అదుపులో నిందితులు

**కర్నూలు, ఆగస్టు 8:** కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని భారీగా వసూలు చేసి ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మొహం చాటేసిన వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటన కర్నూలు నగరంలో జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా... మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధి, శ్రీరామ్‌నగర్‌కు చెందిన ప్రవీణ్ కుషాల్ అనే వ్యక్తిని గురువారం మధ్యాహ్నం కొందరు ఓ ఫార్చునర్ వాహనంలో వచ్చి బలవంతంగా ఎక్కించుకుని వెళ్లారు. దీంతో ప్రవీణ్ కుషాల్ తండ్రి సల్కాపురం రవి హుటాహుటిన పోలీసులను ఆశ్రయించాడడు. పోలీసులు ఈ కేసు దర్యాప్తు ప్రారంభించడంతో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగరంలో పలువురికి తాను వైసీపీ టికెట్లు ఇప్పించాననీ ఇందులో బీవై రామయ్య కూడా ఒకరు అని, ఇలాంటి పెద్దలు ఎందరో తన ద్వారానే టికెట్ పొందారనీ ప్రవీణ్ కుషాల్ ప్రచారం చేసుకున్నాడు. దీనిని నమ్మిన కల్లూరు మండలానికి చెందిన మద్దిలేటి అనే వ్యక్తి కోడుమూరు వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఇప్పించాలని ప్రవీణ్ కుషాల్‌ను కోరాడు. దీంతో రూ.2 కోట్లు పైబడి మద్దిలేటి నుంచి ప్రవీణ్ కుశాల్ వసూలు చేసినట్లు సమాచారం. ఆ తర్వాత ఎమ్మెల్యే టికెట్ మద్దిలేటికి రాలేదు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తానని నమ్మించిన ప్రవీణ్ ఆరు నెలలు కావస్తున్నా డబ్బులు ఇవ్వకుండా మొహం చాటేస్తుండటంతో ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు తెలిసింది. పోలీసులు చాకచక్యంగా నిందితులను అదుపులతో పాటు బాధితుడు ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకుని వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి విషయాలు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించే అవకాశం ఉంది.

## జీవోలను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ



మాట్లాడుతున్న రాజశేఖర్

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 8:** పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే జీవో నెంబర్లు 83, 84, 117లను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ భవన్‌లో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే జునైద్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూసివేసిన బడులను పునఃప్రారంభించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నామని చెబుతూనే విద్యారంగాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో.77ను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 50వేల టీచరు పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడిగా ఎస్కే జునైద్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఆది, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా సాయిప్రకాష్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 8:** ఎస్‌సీఎల్ టెక్ జి సంస్థ ఆధ్వర్యంలో సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఈ నెల 13న ఉదయం 9 గంటలకు ఇంటర్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2022-23, 2023-24 విద్యాసంవత్సరాల్లో 75 శాతం మార్కులతో ఇంటర్మీడియట్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు అని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు Https://bit.ly/techbeeGoAp వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 7780323850 నెంబరును సంప్రదించాలని సూచించారు.

## భూ సమస్యలకు పరిష్కారం చూపాలి: ఆర్డీవో

**గూడూరు ఆగస్టు 8:** ప్రజల నుంచి వచ్చే భూ సమస్యలకు అధికారులు పరిష్కారం చూపాలని ఆర్డీవో శేషిరెడ్డి ఆదేశించారు. గురువారం గూడూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ సమస్యపై రైతుల ఇచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 8:** జిల్లా సాంఘిక సంక్షేమ హాస్టల్స్ వెల్ఫేర్ ఆఫీసర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఎన్నిక జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షులు జెన్నమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంకన్న, ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. నూతన జిల్లా అధ్యక్షుడిగా నాగమద్దయ్య, జనరల్ సెక్రటరీగా ఉస్మాన్, కోశాధికారిగా ఎం.వెంకటరెడ్డి ఎన్నికయ్యారు.

## ఆర్డీవోను కలిసిన టీడీపీ నాయకులు

**గూడూరు ఆగస్టు 8:** గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ కె.రామాంజనేయులును కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారిని శాలువ, పూలమాలతో సన్మానించారు. టీడీపీ నాయకుడు చరణ్ కుమార్ రైతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.

## 20 లీటర్ల నాటుసారా స్వాధీనం

**కోడుమూరు(రూరల్), ఆగస్టు 8:** కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలోని బుక్కాపురం గ్రామంలో గురువారం జరిపిన దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ బుక్కాపురంలో బోయ లక్ష్మీదేవి అనే మహిళ గడ్డివామి వద్ద దాచిన 20 లీటర్ల నాటుసారాను గుర్తించి స్వాధీనం చేసుకొని, ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

**12న వాహనాల వేలం:** కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యంలో పట్టుబడిన వాహనాలను ఈనెల 12న బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. వేలంలో పాల్గొనే ఔత్సాహికులు ఉదయం 11 గంటల్లోగా సెబ్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

## పంట నమోదు చేసుకోవాలి

**సి.బెళగల్, ఆగస్టు 8:** రైతులు పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ సూచించారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి ఆన్‌లైన్ అడంగల్ రికార్డులను తీసుకుని రైతులకు సూచనలిచ్చారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు సిద్దు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

## ఒలింపిక్ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకోవాలి



క్రీడాకారులతో డాక్టర్ శంకర్‌శర్మ, క్రీడా సంఘాల ప్రతినిధులు

**కర్నూలు(స్పోర్ట్స్), ఆగస్టు 8:** ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. గురువారం ఆదర్శవిద్యా మందిర్ మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ అంతర్ పాఠశాలల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధిక జనాబా కలిగిన మన దేశంలో యువతకు కొదవ లేదని, అలాంటప్పుడు ఒలింపిక్స్‌లో మనము చాలా వెనుకబడి ఉండటం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి బి.రామాంజనేయులు, హాకీ సంఘం కార్యదర్శి దాసరి, మహబూబ్‌సుభాని, సుమంత్ నాగ శ్రీనివాసులు, సురేంద్ర, శ్రీకాంత్ పాల్గొన్నారు.



# ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు

**కల్లూరు, ఆగస్టు 8:** కల్లూరు అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం మండలంలోని 76 ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు, మద్దతుదారుల హవా కొనసాగింది. కల్లూరు మండల పరిధిలో 50-ప్రైమరి స్కూళ్లు, అప్పర్ ప్రైమరి-3, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు-26 మొత్తం 76 ఉండగా అందులో 43 స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు కల్లూరు ఎంఈఓ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని స్పష్టం చేశారు. కల్లూరు మండలంలో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం కావడంతో ఉలిందకొండ, సల్కాపురం, కె. మార్కాపురం, పందిపాడు, చిన్నటేకూరు, పెద్దటేకూరు, తడకనపల్లె, బస్తిపాడు, బొల్లవరం, పెద్దపాడు, పర్ల, లక్ష్మీపురం, కొంగనపాడు, కెపి.తాండ, నెరవాడ గ్రామాల్లో టీడీపీ నాయకులు, వారి మద్దతుదార్లు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. ఎస్‌ఎంసీ నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లను పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అభినందించారు.

**కర్నూలు(రూరల్):** కర్నూలు రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన విద్యా కమిటీ ఛైర్మెన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రూరల్ మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు కలిపి 58, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 16, ఒక కేజీబీవీ స్కూల్, మరో ప్రభుత్వ ప్రైమరి స్కూల్ కలిపి మొత్తం 74 పాఠశాలలో ఉన్నట్లు ఎంఈవో హనుమంతరావు, వినోద్‌కుమార్ వివరించారు. 74 పాఠశాలలో 8200 మంది విద్యార్థులు ఉండగా వారి తల్లిదండ్రులకు విద్యాకమిటీ ఎన్నికలు నిర్వహించగా అన్ని స్థానాలు ఏకగ్రీవంగా జరిగినట్లు వారు తెలిపారు.

● నందనపల్లె, మిలటరీకాలనీ, వెంకాయపల్లె, భూపాల్‌నగర్ గ్రామాల్లో టీడీపీ సీనియర్‌నేత విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి సహకారంతో పాఠశాల విద్యాకమిటీ చెర్మెన్, వైస్‌చెర్మెన్ స్థానాలన్నీ టీడీపీ కైవసం చేసుకున్నట్లు మండల టీడీపీ నాయకులు కేశ వేమనగౌడ్ తెలిపారు.

**కోడుమూరు:** కోడుమూరు పట్టణంలోని ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత, ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలలు కలిపి మొత్తం 7 పాఠశాలు ఉన్నారు. ఆయా పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంటు కమిటీల ఎన్నికల గురువారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ వర్గానికి చెందిన వాళ్లు కమిటీ చైర్మనుగా ఎన్నికయ్యారు. ఆయా పాఠశాలల్లో పోటీ లేకపోవడం కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**కోడుమూరు(రూరల్):** మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలలో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ విష్ణువర్ధన్‌రెడ్డి రాజకీయ చతురత, యువనాయకత్వం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ విజయం సాధించారు.

● పలు పాఠశాలల్లో కోరం లేక ఎస్‌ఎంసీ ఎన్నికలు జరుగలేదని ఎంఈవో వసంతలక్ష్మి తెలిపారు. అమడగుంట్ల జడ్పీ, ప్రాథమిక, ఎస్సీ స్పెషల్ పాఠశాలలకు కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశారు. అలాగే లద్దగిరి ఉన్నత పాఠశాల, కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయంలో ఎన్నిక జరుగలేదని అన్నారు. ఎస్ఐ బాలనరసింహులు ఉన్నారు.

**గూడూరు:** మండలంలో స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. గురువారం గూడూరు మండలంలో మొత్తం 33 పాఠశాలలుండగా అందులో 32 పాఠశాలలకు ఎన్నికలు జరిగి చైర్మన్, వైస్ చైర్మన్‌తో సహా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగ, పోన్నకల్లు పాఠశాలలో కోరం సభ్యులు లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ తెలిపారు.

● విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదార్ల హవా: విద్యా కమిటీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదార్ల హవా కొనసాగిందని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కురకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయడు, రేమట వెంకటేశ్వర్లు, పౌలు తెలిపారు.

**ఓర్వకల్లు:** ఓర్వకల్లులో ప్రభుత్వ పాఠశాలలో జరిగిన పాఠశాలల యాజమాన్య కమిటీల ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరుల హవా కొనసాగింది. గురువారం జరిగిన పాఠశాలల యాజమాన్య కమిటీల్లో ఎన్నికలు జరిగాయి. ఓర్వకల్లు మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 10, ఎలిమెంటరీ స్కూల్‌లు 32, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 2, ఉర్దూ పాఠశాల 1లో టీడీపీ అనుచరులే చైర్మన్లుగా, వైస్ చైర్మన్లుగా గెలుపొందారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, మోహన్ రెడ్డి, చదవుల సుధాకర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, భైరి హనుమంత రావు పాల్గొన్నారు.

**సి.బెళగల్:** మండలంలోని 21 గ్రామాలలో పాఠశాలల యాజమాన్యపు విద్యకమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల విద్యాధికారి జ్యోతి మాట్లాడుతూ మండలంలోని 46 పాఠశాలలో విద్యకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అన్నారు.


కోడుమూరులో..


గూడూరులో..


సి.బెళగల్‌లో..


సోమయాజులపల్లెలో జడ్పీహెచ్‌ఎస్ ఛైర్మన్ ఆకుల శ్రీనివాసులుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉపాధ్యాయులు


ఉలిందకొండ జడ్పీ పాఠశాల ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం


మిలిటరీ కాలనీలో..


అమడగుంట్ల జడ్పీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాబుప్రసాద్

## భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

**కర్నూలు (కల్చరల్), ఆగస్టు 8:** కర్నూలు నగరంలో గురువారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని నాగుల పుట్టల్లో భక్తులు పాలుపోసి, నైవేద్యాలు సమర్పించుకున్నారు. వివిధ దేవాలయాల్లోని నాగ దేవతా విగ్రహాలకు క్షీరాభిషేకం నిర్వహించి, విగ్రహాల చుట్టు ప్రదక్షిణలు చేసి చలిమిడి ముద్దల ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు.

**ఓర్వకల్లు:** మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం తదితర గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నాగుల చవితి జరుపుకున్నారు. ఉదయాన్నే మహిళలు, పిల్లలు స్నానాలు ఆచరించి ఆయా గ్రామల్లోని పాముల పుట్ట వద్దకు వెళ్లి పాలు పోసి కాయ కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


ఓర్వకల్లులో పుట్టకు పాలు పోస్తున్న భక్తులు




కర్నూలులో నాగుల పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

## పదోన్నతులు కల్పించండి

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8:** సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్ల పదోన్నతులను ఒక నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్ట రేట్ సమావేశ మందిరంలో కలెక్టరేట్‌లోని అన్ని సెక్షన్ల సిబ్బందితో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ అసిస్టెట్లకు డిప్యూటీ తహసీల్దార్ పదోన్నతులు కల్పించడం ద్వారా సీనియర్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీలు ఏర్పడుతాయన్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు జూనియర్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించవచ్చన్నారు. డీఆర్వో మధుసూదన్‌రావు, ఏవో రాజేశ్వరి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంవీ రమణ మృతికి సంతాపం

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** అనంతపురం జిల్లా సీపీఐ సీనియర్ నాయకులు, రాష్ట్ర సమితి సభ్యులు ఎంవీ రమణ మృతిపట్ల సంతాపం ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర సభ్యులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రమణ ఉస్మానియా యూనివర్సిటిలో విద్యార్థి దశలోనే రాజకీయాల్లోకి వచ్చి చురుగ్గా పాల్గొన్నారన్నారు. రాజకీయ విషయాల్లో ఎక్కడ కూడా రాజీలేని పోరాటం నిర్వహించారన్నారు. ఇలాంటి నాయకుడిని పోగొట్టుకోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన మృతి పట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు.

## విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 8:** విద్యాసంస్థల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రోజావీధిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కర్నూలు ట్రిపుల్ ఐటీలో, అమడగుంట్ల బీసీ వసతి గృహంలోనూ, వైఎస్సార్ జిల్లా ట్రిపుల్ ఐటీల్లో వరుసగా విద్యార్థుల ఆత్మహత్యలు జరగడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సంఘం మహిళా నాయకురాళ్లు దానేశ్వరి, మీనాక్షి, తరణిప్రియ, బీసమ్మ, నాగన్న, ఖాదర్ పాల్గొన్నారు.

## పెంపుడు పశువులు రోడ్లపై తిరిగితే చర్యలు

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** నగరంలోని రహదారులపై పెంపుడు పశువులు సంచరిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలింగేశ్వర్ హెచ్చరించారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గేదెలు, ఆవులు, ఎద్దులు రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజారోగ్య చట్టం-1939, పోలీసు ట్రాఫిక్ నియంత్రణ చట్టాల ప్రకారం పశువుల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నగరంలో విద్యుత్ దీపాల సమస్యలను త్వరిగతిన పరిష్కరించేందుకు, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నట్లు కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు.

## ఆ బిల్లును వెనక్కి తీసుకోవాలి

**కర్నూలు(అర్బన్), ఆగస్టు 8:** వక్ఫ్ బోర్డు భూముల బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డీసీసీ కే.బాబురావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 40 సవరణలు చేయడానికి బిల్లు పెట్టారని వెంటనే విరమించుకోవాలని కోరారు. రక్షణ శాఖ భూములు, రైల్వే ఆస్తులు తీసుకోవడానికి బిల్లు ఎలా పెడతారని ప్రశ్నించారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీన్, అనంతరత్నం మాదిగ, ఎస్ఎం ఖాద్రి బాషా పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో సిమెంటు చెత్తకుండీలు


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు(హాస్పిటల్), ఆగస్టు 7:** మాతాశిశు సంరక్షణ కేంద్రం వద్ద రోగుల సహాయకులు తిన్న ఆహారాన్ని గైనిక్ వార్డు ఎదుట పారవేస్తున్నారని, తక్షణమే అక్కడ సిమెంటు చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని శానిటేషన్ సిబ్బందిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. గురువారం ఆసుపత్రిలోని సుశ్రుత భవన్ గైనిక్, ఆర్థో, చిన్న పిల్లలు, వార్డులలో రౌండ్స్ నిర్వహించారు. ఫీమేల్ మెడికల్ వార్డు దగ్గర మరమ్మతు పనులను పూర్తి చేసి ఆ స్థలానికి పార్కింగ్ ఏర్పాటు అయ్యేవిదంగా చూడాలని సంబంధిత సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. ఆసుప త్రిలో పాత స్క్రాప్‌ను 16వ తేదీ తర్వాత డిస్పోస్ చేసే విదంగా చూడాలని నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయిని ఆదేశించారు. గైనిక్ ఐసీయు వద్ద కూర్చోవడానికి గర్భిణుల సహాయకులకు కుర్చీ లను ఏర్పాటు చేయాలన్నారు. చిన్న పిల్లల విభాగంలోని ఎన్ఐసీయులో బాత్‌రూం, డ్రైనేజీ మరమ్మతులను పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ సీఎస్‌ఆర్ఎంవో డా.బి.హేమ నళిని, ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డా.శివ బాల, డా.కిరణ్ కుమార్, న్యూడయోగ్నస్టిక్ బ్లాక్ ఇన్‌చార్జి డా.సునీల్ ప్రశాంత్, ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపనే సీపీఐ లక్ష్యం

**ఓర్వకల్లు, ఆగస్టు 8:** సమసమాజ స్థాపనే భారత కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య అన్నారు. గురువారం ఓర్వకల్లు మండల నాల్గవ మహాసభ ఘనంగా నిర్వహించారు. ముందుగా బస్టాండు నుంచి పొదుపు భవన్ వరకు సీపీఐ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొదుపు భవన్‌లో జరిగిన మహాసభకు సీపీఐ మాజీ మండల కార్యదర్శి దస్తగిరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు ఆర్థిక సమానతలు పెరిగిపోతున్నాయని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అంబాని, అదానీలకు ఊడిగం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నామని మండిపడ్డారు. అనంతరం నూతన కమిటీనిఎన్నుకున్నారు. ఓర్వకల్లు నూతన కమిటీ సీపీఐ మండల కార్యదర్శిగా ఆవుల రమేష్, సహాయ కార్యదర్శిగా సుధాకర్‌లను ఎన్నుకున్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

**కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 8:** విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ సునీల్ కన్నా అన్నారు. గురువారం మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న తరగతి గదులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లోని వంటశాలలను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

**రైతులను ఆదుకోవాలి:** వెల్దుర్తి మండలం మల్లెపల్లి దగ్గర హంద్రీనీవా కాలువకు గండిపడటంతో భూమి కోతకు గురై నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ గురువారం సీపీ ఎం ప్రతినిధి బృందం డీఆర్వో మధుసూదన్‌రావుకు వినతి పత్రం అందజేశారు.

## దిశ వన్‌స్టాఫ్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

**కర్నూలు(లీగల్), ఆగస్టు 8:** నగరంలోని దిశ వన్‌స్టాఫ్ కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. వన్‌స్టాఫ్ కేంద్రం కార్యాలయానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అక్కడున్న మహిళలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. లీగల్ సర్వీ సెస్ యాక్టు ద్వారా మహిళలు ఉచితంగా న్యాయ సహాయం పొంద డానికి అర్హులు అని, అవసరం ఉన్న వారు స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని కోరారు.

## నేడు మంత్రి టీజీ భరత్ రాక

**ఓర్వకల్లు, ఆగస్టు 8:** మండలంలోని ఇండస్ట్రీరియల్ హబ్‌ను సందర్శించేందుకు శుక్రవారం రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ రంజిత్ బాషా రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని సోలార్, ఉక్కు, ఆయుధాల పరిశ్రమల తోపాటు విమానాశ్రయాన్ని పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

## వయనాడ్ ప్రజలకు అండగా నిలవాలి: సీపీఎం

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ ప్రజలకు దేశమంతా అండగా నిలివాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల అన్నారు. గురువారం సీపీఎం అధ్వర్యంలో వయనాడ్ ప్రజల సహా యార్థం వ్యవసాయ మార్కెట్, కొత్తబస్టాండు, సి.క్యాంపు తదితర ప్రాంతాలలో ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో పీఎస్. రాధాకృష్ణ, టి.రాముడు, సీహెచ్.సాయిబాబా, ఆర్.నరసింహులు పాల్గొన్నారు.

## పశ్చిమబెంగాల్ మాజీ సీఎం మృతికి సంతాపం

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సీపీఎం జిల్లా కమిటీ సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మరణం వామపక్ష ఉద్యమానికి, సీపీఎంకి తీరని లోటని అన్నారు.

## సామాజిక సమస్యలను పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

**కర్నూలు(న్యూసిటీ), ఆగస్టు 8:** దేశంలోని సామాజిక సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దళిత్ సోషన్ ముక్తి మంచ్ దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం దళిత, ప్రజాసంఘాల అధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కేవీపీఎస్, రజకవృత్తిదారుల సంఘం, కాటికాపరి, గుంతలు తీసే బేగరుల సంఘం, ఎస్ఎఫ్ఐ, చర్మకార వృత్తిదారుల సంఘం, దళిత ఉద్యోగుల సంఘం, స్కావెంజర్స్ కార్మిక హక్కుల పోరాట సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి. గురుశేఖర్ మాట్లాడుతూ దళితుల సామాజిక స్థితిగతులు మారాలంటే స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ అమలు చేయాలన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎండీ ఆనంద్‌బాబు, ఎస్.జి. కృష్ణ, ఎస్.అబ్దుల్లా, రామాంజనేయులు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

**కర్నూలు(రూరల్), ఆగస్టు 8:** ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వర్గీకరణను అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం(ఎం.ఈ.ఎఫ్) జాతీయ అధ్యక్షుడు ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం కర్నూలుకు వచ్చిన ఆయన జిల్లా మాదిగ ఉద్యోగ సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సీఎం ఇటీవల విడుదల చేసిన ఉద్యోగ నోటిఫి కేషన్‌లోనే ఎస్సీలకు వారి పోస్టులను వారికే కేటాయిస్తామని అసెంబ్లీలో ప్రకటించారని, ఏపీలో కూడా ఈ పద్ధతి అమలు చేయాలని కోరారు. సమావేశంలో మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు బండారు శంకర్, నాయకంటి మద్దయ్య, ప్రకాష్‌రాజు, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

## గ్రామాల్లో మార్కెట్ యార్డులు నిర్మిస్తాం

● నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి

**మద్దికెర, ఆగస్టు 8:** జిల్లాలోని ఆయా గ్రామాల్లో రైతులకు, ప్రజల సౌకర్యార్థం మార్కెట్ యార్డులు నిర్మిస్తామని జిల్లా నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మద్దికెర మెయిన్‌బజారులో రూ.18 లక్షలు నాబార్డు నిధులతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సుహాసిని, ఎంపీడీవో అలివేలమ్మ, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, గుడివెనుక రామాంజులు, లింగరాజు, చంద్ర తదితరులు ఉన్నారు.

## పురపాలక స్థలంలోని ఆక్రమణల తొలగింపు

**ఆదోని టౌన్, ఆగస్టు 8:** పట్టణంలోని ఎంఎం రోడ్డులోని జీబీ కాంప్లెక్స్ పక్కన గల ఆక్రమణలను గురువారం అధికారులు కూల్చివేశారు. వాణిజ్య సముదాయాలు ఈ ప్రాంతంలో అధికంగా ఉండటంతో ఇక్కడ శౌచాలయం ఏర్పాటు కోసం బీజేపీ నాయకుడు నాగరాజ్ గౌడ్‌లో లోకాయుక్తలో చేసిన ఫిర్యాదుపై స్పందించిన పుర అధికారులు ఆక్రమణలను తొలగించి పురపాలక స్థలాన్ని తిగిరి స్వాధీనం చేసుకున్నారు. కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఎమ్‌ఈ వెంకట చలపతి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, సిబ్బంది సోమన్న, రాజేశ్వరి, శివశంకర్, వినోద్, దేవేంద్ర పాల్గొన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎంలకు క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎంల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు డీలర్లు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీలర్ సంఘం అధ్యక్షులు సోములగూడూరు బాషా మాట్లాడుతూ ఎండీయూల వ్యవస్థను రూపుమాపి పాత విధానాన్ని కొనసాగించాలని సీఎం ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. రేషన్ డీలర్ల పట్ల సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు అబ్దుల్ బాషా, తాయన్న, పాల ఈరన్న, శివకుమార్, చంద్రశేఖర్, రఫీబు, గంగన్న, రబియా, నూరా, ఫొటోశీను, నాగూర్‌బాషా పాల్గొన్నారు.

## ఘనంగా నాగుల చవితి

**ఎమ్మిగనూరు, ఆగస్టు 8:** ఎమ్మిగనూరు పట్టణం, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో అయ్యప్పస్వామి ఆలయం, వీవర్స్ కాలనీలోని ఆంజనేయస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నవ వధువులు నాగప్పలకు ప్రత్యేక పూజలు చేసి పాలు పోశారు.

**మద్దికెర:** మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో నాగులచవితి పండుగ వైభవంగా జరుపుకున్నారు. గురువారం ఆయా గ్రామాల్లోని గ్రామ శివారులోని నాగులకట్ట, నాగులపుట్ట, విగ్రహాలకు పాలు పోసి భక్తులు తమ భక్తిని చాటుకున్నారు.

## న్యాయం జరిగే వరకు పోరాటం

**మంత్రాలయం, ఆగస్టు 8:** విద్యార్థిని కుటుంబానికి న్యాయం జరిగే వరు పోరాటం ఆగదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు, జిల్లా అధ్యక్షులు అఖండ అన్నారు. గురువారం రచ్చుమర్రి మోడల్ స్కూల్ వద్ద ఆదోని, మాధవరం రోడ్డుపై విద్యార్థులు, పార్వతి కుటుంబ సభ్యులతో కలిసి సంఘాల నాయకులు బైటాయించారు. మండలంలోని రచ్చుమర్రి మోడల్ స్కూల్ హాస్టల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని కురువ పార్వతి మృతికి కారణాలు ఇంతవరకు తెలియలేదని, పోస్టుమార్టం రిపోర్టును బయట పెట్టాలని అన్నారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాధవరం ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు.

## గుడ్‌బేస్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

**ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 8:** ఎమ్మిగనూరు పట్టణంలోని గుడ్‌బేస్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నరసన్న యాదవ్, ఆర్‌యూఎస్ఎఫ్ నాయకులు రఘు డిమాండ్ చేశారు. గురువారం ఎంఈవో-2 మధుసుదన్‌రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో రాజు, రామాంజనేయులు, కృష్ణ, ఎల్లయ్య, టైగర్ లు పాల్గొన్నారు.

## నరసాపురం సచివాలయం తనిఖీ

**వెల్దుర్తి, ఆగస్టు 8:** మండలంలో నరసాపురం గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని, చెత్త సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నాగరాజు నాయుడు శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్య పనులు, నీరు లీకు కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈవోఆర్‌డీ నరసింహులు, సర్పంచ్ ఈరమ్మ, పంచాయతీ కార్యదర్శి రహమత్ బాషా పాల్గొన్నారు.

## ఉరుకుందలో ప్రత్యేక పూజలు

**కౌతాళం, ఆగస్టు 8:** శ్రావణ మాసపు ఉత్సవాలలో భాగంగా గురువారం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను వెండి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు దేవాలయం ఆవరణలోనే ప్రత్యేక వంటకాలను చేసి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.

## పూడికతీత పనులు ప్రారంభం

**ఆదోని టౌన్, ఆగస్టు 8:** పట్టణంలోని పెద్ద కాలువలో చేపట్టిన పూడిక తొలగింపు పనులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే డా. పార్థసారథి మునిసిపల్ కమిషనర్ రామచంద్రరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద కాలువలను గుర్తించి వర్షాలు ప్రారంభం కాకముందే పూడిక తొలగించే పనులను చేపట్టామన్నారు. ఎమ్మెల్యే వెంట వెంకట చలపతి, ఏఈ రాజశేఖర్ రెడ్డి, బీజేపీ నాయకులు నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర కుమార్, యూసీ ముని స్వామి ఉన్నారు.

## ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**ఆదోని (అగ్రికల్చర్), ఆగస్టు 8:** ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఒత్తిడికి గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి అన్నారు. గురువారం ఏపీ ఎన్జీవో భవనంలో ఉద్యోగుల ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో అధ్యక్షురాలు ఉషారాణి, కార్యదర్శి బజారప్ప, అసోసియేటెడ్ అధ్యక్షురాలు లక్ష్మీ, వైస్ ప్రెసిడెంట్ మల్లికార్జున, సహాయ కార్యదర్శి మంజునాథ్, థామస్, డిప్యూటీ తహసీల్దార్ వలి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సత్యవతి, డాక్టర్ షహనాద్ బేగం, డాక్టర్ మహేష్, డాక్టర్ హర్షిత పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయాలి

**ఆలూరు, ఆగస్టు 8:** అధికారులు ప్రజలకు సేవ చేయడం బాధ్యత అని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. బుధవారం ఆలూరు ఇన్‌చార్జి తహసీల్దార్ రజినీ కాంత్ రెడ్డితో కలిసి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమ నాయకుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సమస్యలను గుర్తించి నివేదికను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణపై సీఎం నిర్ణయం హర్షణీయం

**ఎమ్మిగనూరు, ఆగస్టు 8:** జిల్లాను యూనిట్‌గా పరిగణించి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ నాయకులు కదిరికోట ఆదెన్న అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. ఎస్సీ 59 ఉప కులాల్లో రిజర్వేషన్ల ఫలాలు జనాభా దామాషా ప్రకారం పంపిణీ జరగాలన్నదే చంద్రబాబు ఆలోచనా విధానమని తెలిపారు.

# అక్రమ వెంచర్లపై చర్యలు

● అనుమతి లేని లేఅవుట్లలో కుడా అధికారుల తనిఖీలు

● డ్రైన్, రోడ్లు, ప్రహరీ కూల్చివేత ● రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో కలవరం



గుడికల్ రోడ్డులో అనుమతులు లేని వెంచర్ ప్రహరీని కూల్చి వేస్తున్న దృశ్యం



అనుమతి లేని వెంచర్లను పరిశీలిస్తున్న కుడా అధికారులు

**ఎమ్మిగనూరు, ఆగస్టు 8:** అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లపై అధికారులు గురువారం చర్యలు తీసుకున్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో ప్రహరీని తొలగించారు. కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ముందుగా తనిఖీలు నిర్వహించారు. భూములకు ఎన్‌ఏ మాత్రమే తీసుకొని మిగతా అనుమతులు తీసుకోకుండా వెంచర్లు వేశారని తెలుసుకున్నారు. ఈ మేరకు గోనెగండ్ల రోడ్డు కలుగొట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వేసిన వెంచర్‌లో సీసీ రోడ్డు, ప్రహరీని తొలగించారు. అలాగే గుడికల్ రోడ్డులో ఇరువురు వ్యాపారులు అనుమతులు లేకుండా ఏడు ఎకరాల్లో ఏర్పాటు చేసిన డ్రైన్‌లను, కొంత మేర ప్రహరీని కూల్చివేయటంతోపాటు రోడ్డును తవ్వేశారు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో కలకలం మొదలైంది. కుడా అధికారుల కూల్చివేతలు జనానికి తెలిస్తే వ్యాపారం దెబ్బతింటుందని ఆందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు ప్రాంతంలో అనుమతులు లేకుండా 40 నుంచి 50 వరకు వెంచర్లు వేసినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. వ్యాపారులకు ప్రొవిజినల్, ఫైనల్ నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో దీంతో తామే నేరుగా రంగంలోకి దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఎమ్మిగనూరు శివారులోని కలుగొట్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మూడు, గుడికల్ పంచాయతీ పరిధిలోని రెండు వెంచర్లలో రోడ్లు, ప్రహరీ, డ్రైన్‌లను కొంతమేర తొలగించామని చెప్పారు. వ్యాపారులు అనుమతులు తీసుకుంటామని చెప్పటంతో ప్రస్తుతానికి నిలిపివేశామని పేర్కొన్నారు. అనుమతులు తీసుకోని పక్షంలో వచ్చే వారం మరోసారి వచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. వెంచర్‌లో కచ్చితంగా పది శాతం భూమిని స్థానిక మున్సిపాలిటీ, పంచాయతీకి అప్పగిస్తేనే అనుమతులు ఇస్తామని అన్నారు.

# ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు



ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డితో ఎస్ఎంసీ సభ్యులు



టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్‌ను సన్మానిస్తున్న ఎస్ఎంసీ సభ్యులు

**ఎమ్మిగనూరు/రూరల్, ఆగస్టు 8:** ఎమ్మిగనూరు పట్టణం, మండల పరిధిలోని ఆయా ప్రాథమిక, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం ఎంపీపీ పాఠశాలతోపాటు మండల పరిధిలోని గార్లదిన్నె, రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి, వెంకటగిరి, బనవాసి, పరమాన్‌దొడ్డి, ఎర్రకోట పాఠశాలల్లో ఎన్నికలను వాయిదా వేశామని విద్యాధికారులు ఆంజనేయులు, మధుసుదన్‌రాజులు తెలిపారు.

**గోనెగండ్ల/నందవరం/వెల్దుర్తి:** గోనెగండ్ల మండ లంలో 55 సూళ్లకు గాను 52 స్కూళ్లలో మొత్తం టీడీపీ సానుభూతిపరులు చైర్మన్‌లుగా ఎన్నిక య్యారు. అలువాల ఎస్సీ కాలనీ, ఎర్రబాడు మెయిన్ పాఠశాల, ఎర్రబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో కోరం లేక ఎన్నిక వాయిద పడినట్లు ఎంఈవో నీలకంఠ తెలిపారు. నందవరం మండలం కనకవీడులో ఎన్నికను వాయిదా వేశారు. వెల్దుర్తి మండలంలో రామళ్ల కోట మినహా మిగిలిన గ్రామాల్లో పాఠశాల చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**చిప్పగిరి:** చిప్పగిరి మండలంలోని 20 పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. చిప్పగిరి, నేమకల్లు, బంటనహాలు, నగరడోన, డేగలహాలులో ఎన్నికలు వాయిదా వేశారు.

**పెద్దకడుబూరు:** మండలంలో 43 పాఠశాలలకుగాను 34 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. తొమ్మిది పాఠశాలల్లో వాయిదా పడ్డాయి. 34 పాఠశాలల్లో కూటమి మద్దతుదారులు ఏకగ్రీ వంగా ఎన్నికయ్యారు.

**మద్దికెర:** మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, మదనంతపురం తదితర గ్రామాల్లోని 26 ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం పాఠశాలల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులే విద్యా కమిటీ చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

**హాలహర్వి:** మండలంలోని 30 పాఠశాలలకు గాను 28 పాఠశాలల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. హాలహర్వి జడ్పీ పాఠశాల, మల్లికార్జున పల్లెకు చెందిన ప్రాథమిక పాఠశాలల ఎన్నికలు ఇరు పార్టీల వాదోపవాదాలు మధ్య ఆగిపోయాయి.

### పత్తికొండలో...

**పత్తికొండ:** మండలంలో 46 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా 45 పాఠశాలల్లో ఏకగ్రీవమయ్యాయని ఎంఈవో-2 రమేష్ తెలిపారు. అటికెలగుండు గ్రామ పాఠశాలలో వాయిదా పడ్డాయన్నారు. రెండు వర్గాలు పాఠశాల వద్దకు చేరుకొని వాదనలకు దిగడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని ఎంఈవో తెలిపారు.

**తుగ్గలి:** మండలంలోని జొన్నగిరి, రాంపురం, పెండేకల్ ఆర్ఎస్, ఎర్రగుడి, రాతన, తదితర గ్రామాల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ముక్కెల, పెండేకల్‌లోని ఎస్సీ కాలనీ పాఠశాలలో ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంఈవో వెంకటేశ్ గౌడు తెలిపారు.

● పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చొరవతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. తుగ్గలి నాగేంద్ర, వరలక్ష్మీ, మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో గురువా రం తుగ్గలిలో జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి రంగస్వామి కేజీబీవీ పాఠశాలల నుంచి పద్మావ తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో గెలి చిన ఎస్ఎంసీ చైర్మన్లు పత్తికొండ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు పూల మాలలు వేసి సన్మానించారు.

**దేవనకొండ:** మండలంలో పాలకుర్తి, మాదాపురం, బండగట్టు గ్రామాల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. దేవనకొండ కస్తూరిబా పాఠశాలలో పాత చైర్మన్ తననే మళ్లీ ఎన్నుకోవాలని పట్టుబట్టాడు. అయితే కూటమి నాయకులు కుదరదని చెప్పి జనసేన అభ్యర్థిని ఎన్నుకున్నారు. మరో మూడు గ్రామాల్లో ఇరు వర్గాల వారు అడ్డుకోవడంతో ఎన్నికలు వాయిదా వేసినట్లు ఎంఈవో తిమ్మారెడ్డి తెలిపారు.

**కోసిగి/ఆస్పరి:** మండలంలోని 48 పాఠశాలలు, 33 ప్రైమరీ పాఠశాలలు, 15 జడ్పీహెచ్ పాఠశాలల్లో గురువారం విద్యా కమిటీ చైర్మన్ల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు మండల విద్యాధికారి-2 నాగేశప్ప తెలిపారు. అలాగే ఆస్పరి మండలంలోని ఎక్కువ పాఠశాలల్లో టీడీపీ మద్దతుదారులు చైర్మన్లుగా ఎన్నికయ్యారు.

**క్రిష్ణగిరి:** మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్, గురుకుల పాఠశాలలో నూతన యాజమాన్య కమిటీలను ఎన్నుకున్నారు. చిట్యాల, లక్కసాగరం, పందిర్లపల్లె, తెగదొడ్డి గ్రామాల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

**ఆలూరు:** మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా 47 స్కూళ్లలో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొలగవల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వైసీపీ మద్దతు దారుడు బొంద మాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తుంగబలబీడు గ్రామంలో వైసీపీ మద్దతుదారుడు ఏకగ్రీవంగా ఎన్నికైనా టీడీపీ నేత వీరభద్ర గౌడ్‌ను కలిసి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

**ఆదోని (అగ్రికల్చర్)/ఆదోని రూరల్:** ఆదోని నియోజకవర్గంలో 130 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి మద్దతుదారులదే ఎన్నికయ్యారు. 122 పాఠశాలల్లో టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతుదారులు ఎస్ఎంసీ ఎన్నికల్లో ఏకగ్రీమయ్యారు. పాండవగల్లు గ్రామ పాఠశాలలో మాత్రం సీపీఎం, వైసీపీ మద్దతుదారులు కలిసి ఏకగ్రీవం చేసుకున్నారు. సంతేకుడ్లూరు, సలకలకొండ, కొత్తూరు, హనవాళ్, సుల్తానపురంలో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

**హొళగుంద:** మండలంలో ఎస్ఎంసీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మూడు పాఠశాలల్లో ఎన్నికలు నిలిపి వేశారు. మరో నాలుగు పాఠశాలలో కోరం కమిటీ లేకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశారు.

**కౌతాళం:** మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలకు ఎస్ఎంసీ నిర్వహించగా తోవి గ్రామ పాఠశాలలో మాత్రం వివిధ కారణాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

## మెరుగైన విద్యను అందించాలి: ఆర్డీవో



రాతన ఆశ్రమ పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

**తుగ్గలి, ఆగస్టు 8:** విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాతన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పేద విద్యార్థులు హాస్టల్స్‌లో చేరారని, వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ఉపాధ్యాయులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు నివసించే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ సుధాకర్ రెడ్డి, వీఆర్వో నాగేంద్ర తదితరులు ఉన్నారు.

## తహసీల్దార్‌గా నిత్యానందరాజు

**కోసిగి, ఆగస్టు 8:** కోసిగి తహసీల్దార్‌గా ఎ.నిత్యానంద రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా బద్వేల్‌లో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తూ తహసీల్దార్‌గా కర్నూలు జిల్లాకు బదిలీ అయారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్, ఆర్ఐ శ్రీరాములు, సర్వేయర్ బసవరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు.

## ఆదోని డీఎస్పీగా సోమన్న

**ఆదోని, ఆగస్టు 8:** సీఐడీ విభాగంలో డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సోమన్న ఆదోని డీఎస్పీగా బదిలీ చేశారు. ఆదోని డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శివనారాయణ స్వామిను ప్రభుత్వ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేసింది. అనంతరం ఆదోనికి డీఎస్పీగా సోమన్నను ప్రభుత్వం నియమించింది. దీంతో సీబీఐ విభాగంలో పని చేస్తున్న సోమన్న ఆదోని డీఎస్పీగా బదిలీపై రానున్నారు.

## ఆలూరు ఎస్ఐగా నరసింహులు

**ఆలూరు, ఆగస్టు 8:** ఆలూరు ఎస్ఐగా సి.వెంకట నరసింహులు నియామకమయ్యారు. ఈయన చిత్తూరు జిల్లా సోమ్లా పోలీస్ స్టేషన్ నుంచి ఆలూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఉన్న ఎస్ఐ ఓబులేసును వీఆర్‌కు పంపినట్లు డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట నరసింహులు శుక్రవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**మంత్రాలయం, ఆగస్టు 8:** మండలంలోని సూగూరు, బూదూరు, చిలకలడోణ గ్రామాల కూడలి వద్ద రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడితట్ల ఉరుకుందు అనే వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తెస్తుండగా సెబ్ సీఐ భార్గవ్ రెడ్డి ఎస్ఐ సత్యనారాయణ దాడి చేసి పట్టుకున్నారు. గురువారం బైకులో 288 కర్నాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టుచేశారు. బైకును సీజ్ చేసి నిందితుడ్ని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ నర్సానాయుడు, కరుణాకర్, షేక్షావలి, రబ్బాని, గోపాల్, భరత్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కోసిగి, ఆగస్టు 8:** కోసిగి మండలం దేవరబెట్ట గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనంపై 14 బాక్సుల్లో అక్రమ కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న దుద్ది నాగరాజుపై కేసు నమోదు చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనం సీజ్ చేసినట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సీఐ నర్సానాయుడు తెలిపారు. మండలంలో అక్రమ మద్యం తరలిస్తున్న వారిపై విస్తృతంగా దాడులు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

డోన్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి



కస్తూరిబా పాఠశాలను పరిశీలిస్తున్న డోన్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి

**వెల్దుర్తి, ఆగస్టు 8:** విద్యార్థులు చదువులో ప్రతిభ కనబరచి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డోన్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్ తంగమణి అన్నారు. శుక్రవారం పట్టణంలో కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో రికార్డులు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. బాలికలు తమ బంగారు భవిష్యత్తుకు విద్యతోనే బాటలు వేసుకోవచ్చన్నారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదికలు పంపుతానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ ఎస్‌వో మంజుల, ఎస్ఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యావకాశాలు కల్పించండి

**పత్తికొండ, ఆగస్టు 8:** అన్ని విధాల వెనుకబడ్డ పత్తికొండ ప్రాంతంలో సాంకేతిక విద్యావకాశాలు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు ఏబీవీపీ నాయకులు గురువారం వినతి పత్రం అందించారు. స్థానికంగా పాలిటెక్నిక్, ఐటీఐ వంటి టెక్నికల్ కళాశాలలు లేకపోవడంతో వేరే ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తుగ్గలి నాగేంద్ర, సురేష్‌కుమార్, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్, కరణం నరేష్, కార్తీక్, వినోద్, రాజశేఖర్‌ల తోపాటు పలువురు సంఘం నాయకులు ఉన్నారు.

## అలువాలలో దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

**గోనెగండ్ల, ఆగస్టు 8:** మండల పరిధిలోని అలువాల గ్రామంలో శ్రావణ మాస చవితి సందర్భంగా కాశీ వీరప్పస్వామి స్వామి దేవాలయంలో విగ్రహ, కలశ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితులు చేపట్టారు. అంతకు ముందు రోజు స్వామివారి విగ్రహాలకు జలన్యాసం, నవధాన్యాసం, నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా మంగళ హారతి, కుంకుమార్చన, ఆకుపూజ చేశారు. అలాగే దేవాలయం గోపురంపై కలశ ప్రతిష్ఠ చేశారు. పలు రాజకీయ పార్టీ నాయకులు ఈకార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు

**పెద్దకడబూరు:** మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో యాదగిరప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా గురువారం జరిగింది. ముందుగా స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.

**కల్లుకుంటలో...** మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠపాన జరిగింది. ముందుగా మహిళలు కళశాలతో ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు. రాష్ట్ర రైతు సంఘం అధికారి ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు. వైసీపీ నాయకులు ప్రదీప్ రెడ్డి, సత్యగౌడ్, మంత్రాలయం జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న, వాల్మీకి నాయకుడు ఈరన్నలు విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

## వైభవంగా విగ్రహాల ఉరేగింపు



విగ్రహాల ఉరేగింపులో పాల్గొన్న మహిళలు

**దేవనకొండ, ఆగస్టు 8:** దేవనకొండలో పునర్నిర్మించిన ఆలయాల్లో ప్రతిష్ఠించే విగ్రహ ప్రతిమలను గురువారం దేవనకొండలో వైభవంగా ఉరేగించారు. శ్రీచెన్నకేశవ స్వామి, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయ్య స్వామి విగ్రహాలతోపాటు బొడ్రాయిని ప్రతిష్ఠించే నేపథ్యంలో గ్రామంలోని వీధుల గుండా మహిళలు, చిన్నారులు కలశాలతో ఉరేగించారు. ఆలయాలలో ప్రాతఃకాల పూజ, దీక్ష, మహా స్నానం, ప్రదోశ, ప్రతిష్ఠ, హోమాలు నిర్వహించి ఆలయాల వద్ద అన్నదానం చేశారు.

## పేదల సంక్షేమానికి ఆర్డీటీ కృషి

**మంత్రాలయం, ఆగస్టు 8:** బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఆర్డీటీ ఎనలేని కృషి చేస్తోందని ఆర్డీటీ ఏరియా కోఆర్డినేటర్ కృష్ణయ్య అన్నారు. గురువారం మండలంలోని సూగూరు గ్రామంలో గ్రామస్థుల కోసం ఉచితంగా అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించి సీడీపీవోకు అప్పగించారు. ఈ భవనాన్ని సుందరంగా నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీవో నాగలక్ష్మి, సూపర్‌వైజర్ నాగవేణి, నరసింహులు, రామ్మోహన్, వాసు, జయసింహ పాల్గొన్నారు.

## రాఘవేంద్రుడి సన్నిధిలో సినీ నటుడు విక్రమ్

**మంత్రాలయం, ఆగస్టు 8:** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం సినీ నటుడు విక్రమ్‌గౌడు కుటుంబ సమేతంగా గురువారం మంత్రాలయం వచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట బిందు మాధవ్, వ్యాసరాజాచార్, ప్రకాష్ ఆచార్ తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో అనాథ మృతి

**కోసిగి, ఆగస్టు 8:** కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఓ అనాథ మృతి చెందాడని ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్ తెలిపారు. కోసిగి పట్టణంలో భిక్షాటన చేసుకొని, పాఠశాల ప్రాంగణంలో సేద తీరుతుండేవాడు. గురువారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో మృతి చెందాడు. కోసిగి మేజర్ పంచాయతీ సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరిపారు.

## స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

**మంత్రాలయం, ఆగస్టు 8:** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రావణమాసం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన తొలి గురువారం శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బృందావనానికి క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం చేశారు. పూర్ణబోధ పూజ మందిరంలో మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేశారు. అనంతరం స్వర్ణరథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలును ఊరేగించారు. ఆ తర్వాత ఊంజలసేవ నిర్వహించారు.

## నిందితుల అరెస్టు

**ఆస్పరి, ఆగస్టు 8:** మండలంలోని బిలేకల్ కూరగాయల మార్కెట్‌లో ఘర్షణకు దిగి పోలీసులను గాయపరిచిన సంఘటనలో వైసీపీకి చెందిన 28 మందిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆలూరు సీఐ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. వైసీపీకి చెందిన ధనుంజయ, నూరి, రాజశేఖర్, రంగన్న, మల్లప్పతో పాటు 23 మందిని కోర్టుకి హాజరు పరిచినట్లు డీఎస్పీ వివరించారు. అదేవిధంగా మరో వర్గానికి చెందిన వారిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

## పండ్ల తోట సాగుకు దరఖాస్తు చేసుకోండి

**మద్దికెర, ఆగస్టు 8:** ఉపాధి హామీ పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయంలోని సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదెకరాల కంటే తక్కువ భూములు ఉన్న వారు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను ఉపాధి కార్యాలయం లో అందజేయాలన్నారు. పండ్ల తోటలు సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.